


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

**తిరువణ్ణామలై:** అరుణాచలం.. రమణమహర్షి నడయాడిన చోటు. భగవాన్ రమణమహర్షిగా వెలుగొందిన చోటు. అగ్ని లింగం వెలుగులు చిమ్మేచోటు. ఏ గిరిప్రదక్షిణ జన్మ జన్మల పాపాలను తొలిగిస్తుందో ఆ గిరి స్థిరబిందువై, శివ త్రిశూల మూలబిందువై కాంతులీనుచున్నచోటు. ఎందరో దేవతలు అదృశ్యరూపులై మానవులపై దయాదృష్టిని కురిపించే చోటు. భక్తులు ఎంతమంది వచ్చినా ఉచితంగా ఆహారమూ, బస ఏర్పాటు చేసే 'శివసన్నిది' ఆరామాలు ఉన్నచోటు, యోగపురుషుడు విసిరి రామ్ కుమార్ ఆశ్రమం నెలకొన్నచోటు. అంతెందుకు సాహిత్యాన్ని తన పేరుతో జత చేసుకున్న ఒకప్పటి రెబల్ రైటర్ 'చలం' భక్తి సాగరంలో యీదులాడినచోటు. సౌరీస్‌కి శివ సాక్షాత్కారం లభించిన చోటు.

ఎంతైనా చెప్పగల పుణ్యక్షేత్రమది. ఎంత చెప్పినా తక్కువ అనిపించే మనోక్షేత్రమది. అక్కడ అగ్నిలింగమేకాదు, జల, వాయు, ఆకాశ పృధ్వీ లింగాలు కూడా దర్శనమిస్తాయి. జాగ్రత్తగా అడిగి తెలుసుకుని చూస్తే.

ఒక పాటలో 'పృధ్వీ జలవాయురాకాశ తేజో విలాసా'అన్న పదం ఉన్నది. (మహేశా పాప వినాశా పాట) ఆ పదానికి ప్రత్యక్షర తీర్ధం యీ తిరువణ్ణామలై. రోజూ వేలాది మంది, ప్రతి పౌర్ణమి రోజునా లక్షలాది మంది దర్శించే మహా శైవక్షేత్రం.

శ్వాసించే సర్వమూ 'శివమే, చీమనించి ఏనుగువరకూ, పసిరికనించి మహావృక్షం వరకూ సర్వమూ శివమే. శ్వాస ఆగిన మరుక్షణం సర్వమూ శవమే.

ఆ శ్వాసను సృష్టించే ప్రణవానికి ప్రతీకే తిరువణ్ణామలై. అది దర్శించడమే 'ముక్తి', 'జీవన్ముక్తి' అంటారు. వందలాది సంఖ్యలో అక్కడే స్థిరనివాసం ఏర్పరచుకొన్నూ సాధు సన్యాసులు. అడుగడుగునా శివలింగమే అక్కడ.

ఆలయకార్య నిర్వహణాధికారి పేరు సెందిల్. అక్కడికి వచ్చిన ఎవ్వరూ రమణాశ్రమం దర్శించకుండా వెళ్ళరు. కౌపీనాధారియైన రమణులు సాక్షాత్తూ శివుడే అని భక్తులు నమ్ముతారు. పాల్ బ్రంటన్ వ్రాసిన పుస్తకంలో రమణమహర్షులు వారి మహిమ వైభవం మన చదవొచ్చు.

స్కందాశ్రమం, సూర్య చంద్ర లింగాలేకాక అనేకానేక గుప్తస్థలాలు ఉన్నాయి. అవి స్థానికులకు కూడా తెలియనివి. జ్ఞాన చక్షువులకి మాత్రమే గోచరించేవి.

ఈ శరీరమేకాదు సర్వజీవులూ, సర్వపదార్ధాలు విశ్వమూ కూడా నిర్మితమైనవి పంచభూతాలలోనే ప్రతిజీవిలోనూ యీ పంచభూతాలే కాక భూతశక్తిని తెలిపే, శక్తి , ప్రాణము ఉన్నాయి. మన శరీరంలో జలం ఉంది, అగ్ని వుంది, వాయువుంది, శరీరముండి అన్నిటికీ 'అవకాశం ' ఇచ్చిన ఆకాశముంది.

ఇది ఆధ్యాత్మికం కాదు. ప్యూర్ సైన్స్. డాల్టన్స్ అటామిక్ థియరీ థియరీవంటివి పుట్టుకముందే కణాలు గురించి అద్భుతంగా విశ్లేషించిన కణాదుడు ఉన్నాడు. గణితం పుట్టింది ఇక్కడ. జ్యోతిష్యము ఖగోళశాస్త్రమం పుట్టింది ఇక్కడ, యీ దేశంలో ఇది ఎవరూ కాదనలేని సత్యం.

ప్రతి జీవిలోనూ జఠరాగిని ఉంది. ఆ అగ్ని లేనినాడు ఏ జీవీ జీవించలేదు. అందుకనే మన పూర్వీకులు" అన్నం బ్రహ్మ

రసో విష్ణు విష్ణుః

భోక్తా దేవో మహేశ్వరః అన్నారు

అంటే ఆహారం వల్లనే సృష్టి. అంటే పదార్ధం లేక సృష్టిలేదు. "matter is composed of small tiny particles which are called atoms" అన్నదే అన్నం బ్రహ్మని అర్ధం.

ఈమాట డాల్విన్ చెబితేగానీ మనవారి చెవికి ఎక్కలేదు. అది విష్ణువుకి ప్రతీక. అంటే, బ్రహ్మ (పదార్ధం) విష్ణు (శక్తి) మూడవది శివుడు (దైవత్వము) లేక చైతన్యం. అంటే పదార్ధంలో ఉన్న శక్తిని చైతన్యంగా మార్చే మహా శక్తే శివుడు. దీన్నే G.O.D అనగా జనరేషన్, ఆర్గనైజేషనన్, డిస్ట్రక్షన్ అనే మూడు శక్తుల కలయికే భగవంతుడు అన్నారు పాశ్చాత్యులు.

సృష్టి –స్థితి – లయము' అని GOD ని స్థిరీకరించింది కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భారతీయులే. సాక్ష్యాలు కోకొల్లలు. సాక్ష్యాలు ఒకవేళ లేకపోయినా సత్యం మారదుగా.

"మానవుడి శరీరాన్ని చైతన్యవంతంగా ఉంచే జఠరాగ్ని స్వరూపమే ఈ అగ్నిలింగం" వివరించాడు ఓ సాధువు విసిరి రామ్ కుమార్ ఆశ్రమంలో, అదీ ఇంగ్లీషులో!

"మీరేం చదువుకున్నారు?" అడిగాడు రాబీ, అనబడే రాబీ వెబ్‌స్టర్ (రాబర్ట్ వెబ్‌స్టర్)

"హార్వర్డ్ యూనివర్సిటీలో కొంతకాలం ప్రొఫెసర్‌గా ఉన్నా. చాలా యూనివర్సిటీలకి గెస్ట్ ఫేకల్టీగా వెళ్ళేవాడ్ని. అయినా ఈ దేశానికి, అంటే, నా దేశానికి తిరిగి వచ్చాక నాకు అర్థమైంది. జీవితం అంటే మనం చదువుకుంటున్న చదువు కాదనీ. ఆ చదువు కావాలంటే అన్వేషించడం ఒకటే మార్గమనీ!" అన్నాడు ఆ సాధువు చిరునవ్వు నవ్వుతూ.

"మరి ఇక్కడికెలా వచ్చారూ?" అడిగాడు రాబీ.

పంచభూతాలూ లింగస్వరూపంలో ఉన్న తీర్థాలని దర్శించాలని నా గురువు ఆజ్ఞ. అందుకు వచ్చాను." అన్నాడా సాధువు. అతని ముఖం చాలా ప్రశాంతంగా ఉంది.

"మీ పేరు?" అడిగాడు రాబీ.

"పూర్వనామం చెప్పకూడదు. అసలు నా పూర్వవృత్తి గురించి కూడా మాట్లాడకూడదు. కానీ, మీరు ఇతరదేశం నించి ఇక్కడికి వచ్చారు కనక నా చదువు వివరం చెప్పాను. నా ప్రస్తుత నామం త్రికాలానంద" అన్నాడు.

"అంటే?" అడిగాడు రాబీ.

"భూత, భవిష్యద్వర్తమానకాలు మూడింటినీ సమంగా ఆదరించి ఆనందించేవాడన్నమాట" పెద్దగా నవ్వాడు త్రికాలానంద.

"ఓహ్... పాస్ట్. ప్రజంట్, ఎండ్ ఫ్యూచర్ అన్నమాట" తనూ నవ్వి అన్నాడు రాబీ.

"యస్" అన్నాడు త్రికాలానంద.

"సరే. నా ఫాస్ట్ నాకు తెలుసు. ప్రజంట్‌గా నేను మీతో, యీ తిరువణ్ణామలైలో ఉన్నాను. అయితే  నా ఫ్యూచర్ ఏమిటీ? చెప్పగలనా?" అడిగాడు రాబీ కుతూహలంగా.

"సారీ మిత్రమా, మై ఫ్రెండ్, నా పేరు త్రికాలానంద, అంటే భూతభవిష్య వర్తమానాలు శుభకరమైనవైనా కష్టాన్ని కలిగించేవైనా  హద్దుదాటైనా సరే సహిస్తూ అదీ – సంతోషంగా సహిస్తూ ఆనందం పొందేవాడని నా పేరుకి అర్థం. అంతేకానీ నేను జ్యోతిష్యుడ్నో మరొకటో కాదు. కానీ జ్యోతిష్యం కొంత నేర్పుతారు" అన్నాడు త్రికాలానంద.

"నేర్పుతారా? సన్యాసులకి జ్యోతిష్యం ఎందుకూ?" ఆశ్చర్యంగా అడిగాడు రాబీ.

"కాషాయం కట్టుకున్న మాత్రాన వారిని సన్యాసులుగా భావించకూడదు. ఏ పనీ చెయ్యకుండా రికామీగా సోమరిపోతుగా తిరిగేవాడు ఎన్నటికీ సన్యాసి కాలేడు. మేము గురుముఖతా నేర్చుకోవలసినవి చాలా వుంటాయి" అన్నాడు త్రికాలానంద.

"ఏమి నేర్చుకోవాలీ?" కుతుహలం నిండిన గొంతుతో అన్నాడు రాబీ.

"ఆయుర్వేదం, గణితం, జ్యోతిష్యం, తర్కశాస్త్రం, మనోవిశ్లేషణ, మానసిక వైద్యం, పంచాగంపై సంపూర్ణజ్ఞానం ఇలా ఎన్నో ఎన్నో గురుముఖతా నేర్చుకోవాలి. నిజం చెబితే పధ్నాలుగు సంవత్సరాలు పడుతుంది విద్యనభ్యసించడానికి. వ్యాకరణం, సంస్కృతి మాత్రమేకాక. పూర్వ ఉత్తర మీమాంసలు, ఉపనిషద్ పఠనం, ద్యానం, యోగం వంటివి ఎన్నో మాకు తెలిసి ఉండటమేగాక కొద్దోగొప్పో ప్రజ్ఞ కూడా వుండాలి. ఇవన్నీ కూడా శ్రద్ధా భక్తులతో గురువుని సేవించి నప్పుడే పట్టుబడతాయి. అయ్యా ఒకసారి గురువు సన్యాసదీక్ష ఇచ్చాక ఆ గురువే మాకు తల్లీ తండ్రీ బంధువు, మిత్రుడు సర్వస్వం."

భక్తిగా గురువుని తలుచుకుని అన్నాడొ సన్యాసి.

"ఇప్పుడు మీరు సన్యాసేగా. అవన్నీ మీకు తెలిసి ఉండాలిగా. మరి నా భవిష్యత్తు చెప్పడానికి మీకు ఎందుకూ అయిష్టత? నేనసలు ఇవేమీ నమ్మేవాడ్ని కాదు. కానీ నాకు తెలియకుండానే నేనీ 'భక్తి ' అనే బుద్దిలేని సుడిగుండంలో చిక్కుకున్నా. కనీసం నాకు విముక్తి ఎప్పుడో అయినా చెప్పండి" అన్నాడు రాబీ.

చుట్టూ ఉన్న వాళ్ళు సంభాషణ వింటున్నారు.

"నేను సంపూర్ణ సన్యాసిని కాదు. దీక్ష చివరివరకూ వచ్చినవాడ్ని. మరో నాలుగు మహా శివలింగాలని దర్శించుకోవాలి. అప్పటివరకూ నేను చెప్పకూడదా అంటే, చెప్పవచ్చు. అది అర్ధజ్ఞానంతో కూడుకున్నదే అవుతుంది. అయినా ఓ విదేశీయుడా నీవడిగావు.. నేను చెబుతున్నాను. నీవు ఎక్కడినించి ఇక్కడికి వచ్చినా నీదేశం ఇదే" అన్నాడు సాధువు.

ఆ సాధువు అప్పటిదాకా మాట్లాడిన విధంగా లేవు ఆ మాటలు. ఏదో ట్రాన్స్ లో ఉన్నట్టువున్నాయి. చుట్టు పక్కలవాళ్ళు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"మీరేనా మాట్లాడుతున్నదీ?" ఆశ్చర్యంగా అడిగాడు రాబీ.

"యస్.. నేను నీకు పరిచితుడ్నే. విలియమ్స్ ని.నీ శరీరంలోకి నేను ప్రస్తుతం ప్రవేశించలేను. ఈ సన్యాసి శరీరంలోకి ప్రవేశించలేదు. 'వాక్కు'ని మాత్రం వాడుకుంటున్నా. మిస్టర్ రాబీ వెబ్‌స్టర్ నిన్ను అనేకసార్లు ఆవహించాను. 'ఆవాహన ' చేయడం ఎలాగో పూజలు చేసే ఏ ఇండియన్‌ని అడిగినా చెబుతాడు. అదలా వుంచితే, గతజన్మలో నువ్వు ఇండియన్ బ్రాహ్మిన్‌వి. నీ తండ్రి అప్పుడు అంటే, 200 సంవత్సరాల క్రితం గోవిందరాజు స్వామి ఆలయంలో పూజారి. అనేకమంది పూజార్లలో ఆయనా ఒకడైనా, ఆయన స్వచ్ఛమైన భక్తుడేకాదు, విష్ణాలయంలో విష్ణు పూజలు చేసే

శివభక్తుడు. హరిహరుల్ని సమానంగా ఆదరించిన సత్పరుషులు. అప్పటి నీ జన్మ యొక్క కర్మఫలం వల్ల చాలా చాలా ఏళ్ళు అశరీరుడిగా ఉండి చివరికి వెబ్‌స్టర్ వంశంలో జన్మించావు. రాబోయే కాలంలో నీవలన కావాలసిన పని ఒకటి ఉంది. అందుకే, ప్రశాంతంగా ఉండు. ఆ కర్తవ్య నిర్వహణ నీకు మంచే చేస్తుందని మాత్రం గ్రహించు. ఒక్కమాట విను – ఎవరి భవిష్యత్తూ ఎవరి చేతుల్లోనూ ఉండదు. అది ఉండేది కాల పురుషుని చేతిలో." సన్యాసి కళ్ళు మూసుకునే మాట్లాడటం ఆపాడు. రాబీ నిచేష్టుడయ్యాడు. కారణం, విలియమ్స్ మాట్లాడిన భాష. స్పష్టమైన యూరోపియన్ ఇంగ్లీష్. అమెరికన్ ఇంగ్లీషు కాదు. అతను మాట్లడిన విధానం రాబీలో గత స్మృతుల్ని రేపెట్టింది.

అతనికి జై, శ్రీనివాస్, పరమేశ్వరశాస్త్రిగారు, సుదర్శన్ భట్టాచార్య, గోవిందరాజస్వామి ఆలయం అన్నీ వరుసగా గుర్తొచ్చాయి. కొన్నాళ్ళపాటు స్పృహలేని స్థితిలో ఉండటం, అప్పుడు వారంతా తనని కాపాడి సేవలు చెయ్యడం అంతా గుర్తుకొచ్చింది. అన్న ఎడ్వర్డ్ వెబ్‌స్టర్, తన ప్రియురాలు 'నికోల్' గుర్తుకొచ్చారు. అమెరికాకి వెళ్ళాల్సిన సమయం వచ్చినా అది పోస్ట్‌పోన్ కావడం యాదృచ్ఛికం కాదన్న విషయం ఇప్పుడు అర్ధమైంది.

"మిస్టర్ విలియమ్స్" సన్యాసిని చూస్తూ పిలిచాడు రాబీ. సన్యాసి కళ్ళుమూసుకునే ఉన్నాయి. కానీ పలుకలేదు.

"అతనిని ఎవరు ఆవహించారో వాళ్ళు వెళ్ళిపోయారు" అన్నాడు విబూది రేకలు పెట్టుకున్న ఓ యువకుడు.

"నా పేరు ప్రవస్థి నేను చదువుకుంటున్నది ఇంగ్లీష్ మీడియం. అందుకే మీ సంభాషణ నాకు చక్కగా అర్ధమైంది" అన్నాడతను మళ్ళీ.

"ఆవాహన నీకు తెలుసా?" అడిగాడు రాబీ.

"పూజ చేసేటప్పుడు 'ఆవాహయామి' అంటాం. అలాగే శ్రద్ధతో శ్రార్ధం పెట్టినప్పుడు కూడా 'భోక్తలకి' మా పూర్వీకులు అంటే తండ్రి తాత ముత్తాతలని ఆవహింపజేసే మంత్రాలు చదువుతాం. ఓసారి మా తాతగారు శ్రార్ధకర్మ జాగ్రత్తగా గమనించాను. భోక్త నాకు తెలిసినవాడే. అతనికి గారెలు పెద్దగా నచ్చవు. తినాలి గనక ఒకటో రెండో తినేవాడు. మా తాతగారికి గారెలన్నా అల్లం పచ్చడి అన్నా మహా ఇష్టంట. ఆ రోజున ఆ భోక్త మీరు నమ్మలేరు, 38 గారెలు ట్రాన్స్‌లో తిన్నట్టు తిన్నాడు. పెద్ద గిన్నెడు అల్లం పచ్చడి ఖాళీ. సామాన్యంగా ఓ ఇరవైమందికి ఆ పచ్చడి హాయిగా సరిపోతుంది ఇది నేను కళ్ళారా చూసిన సంఘటన. మా గురువుగార్ని అడిగితే, తరవాత ఆయన చెప్పారు. అత్యంత శ్రద్ధతో, పద్ధతి ప్రకారం చెయ్యగలిగితే యీనాడు ఆవాహన చెయ్యొచ్చని" అన్నాడు తను.

"ఇవన్నీ పనికిమాలిన మాటలు. గుడ్ ఫర్ నథింగ్ చర్చలు" చికాగ్గా అన్నాడు రాబీ.

"డియర్ సార్, మీరు లేవాలంటే, మీ మనసు సంకల్పించాలి ముందు. అలాగే ఏది చెయ్యాలన్నా మీ మనసు సంకల్పించకపోతే జరగదు. మనసు శక్తిని తెలుసుకోవడంలోనూ దాన్ని నిగ్రహించడంలోనూ మీ పాశ్చాత్యులకంటే కొన్ని లక్షల సంవత్సరాలు మేము ముందున్నా. థామస్ అల్వా ఎడిసన్ అనేకానేక నూతన ఆవిష్కరణలు చేయడం వెనుక

ఉన్నది అతని సంకల్ప బలంకాదా. E=Mc square అని స్థిరీకరించి థియరీ ఆఫ్ రెలిటివిటీని ప్రపంచానికి ఇచ్చింది అల్బర్ట్ ఐన్ స్టెయిన్ సంకల్పబలంకాదా, మరో మాటలో చెప్పాలంటే ఏకాగ్రతకాదా? అసలు వీటన్నిట్నీ మీరు నమ్మకపోతే, మీ భవిష్యత్తు చెప్పమని ఎలా అడిగారూ? థింక్ బిఫోర్ యూ టాక్!" నవ్వుతూనే చురకపెట్టాడు ప్రవస్థి.

సడన్‌గా రాబీకి నికోల్ గుర్తుకొచ్చింది. ఒకనాడేదో డిస్కషన్‌లో రాబీ చికాగ్గా ఇలాగే మాట్లాడితే నికోల్, "థింక్ బిఫోర్ యూ టాక్. డోంట్ మేక్ ఏ ఫూల్ అవుటాఫ్ యువర్ సెల్ఫ్ ఇన్ ఫ్రంటాఫ్ పబ్లిక్" అన్నది. ఇవాళ జరిగిందీ జరుగుతున్నదీ అదేగా! సుదీర్ఘంగా నిట్టూర్చాడు రాబీ.

"యస్ మై ఫ్రెండ్. నువ్వు చెప్పిందే నిజం. నిజం కాకపోతే ఇన్ని యేళ్ళు నిలిచి వుండదుగా! ఐ యామ్ సారీ" అన్నాడు ప్రవస్థితో

"నో..నో..హార్ష్‌గా మాట్లాడినందుకు నన్నే క్షమించండి" అపాలజీ చెప్పాడు ప్రవస్థి.

సన్యాసి కళ్ళు తెరిచాక అతనితో గుడ్‌బై చెప్పి మద్రాస్ వెళ్ళిపోదామనుకున్నాడు రాబీ. అరగంటైనా సన్యాసి వేళ్ళు విప్పలేదు. రాబీ కూడా కూర్చున్న చోటే ఉండిపోయాడు, సన్యాసి మూసిన కళ్ళను తదేకంగా చూస్తూ.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments